అథర్వణవేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

16 పాశుపత బ్రహ్మోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

శ్లోక తాత్పర్య పుష్పమ్

శ్లో॥ పాశుపత బ్రహ్మవిద్యా
సంవేద్యం పరమాక్షరమ్
పరమానంద సంపూర్ణం
రామచంద్రపదం భజే॥



"పాశుపతము" అని పిలువబడు "బ్రహ్మవిద్య" యొక్క అధ్యయనముచే తెలియబడునది, సర్వజగత్ దృశ్యమునకు మునుముందే సర్వదా (పరమై)యున్నట్టిది, మార్పుచేర్పులచే స్పృశించబడకపోవుటచే అక్షరమైనట్టిది, పరమానందము, స్వసంపూర్ణము అయినట్టిది - అగు "శ్రీరామచంద్రపదమును" ఉపాసించుచున్నాము.

1. హరిః ఓమ్। అథ హ వై స్వయంభూః బ్రహ్మా "ప్రజాః సృజాని....!" ఇతి కామకామో జాయతే।	ఓం। సర్వము హరిమయము। తనకు తానే జనించినట్టి (స్వయంభువు అగు) బ్రహ్మదేవుడు ఒకానొకప్పుడు **"నేను జీవులను సృష్టించెదను గాక!"** - అను కోరికను పొందారు (కామకాముడు అయినారు). [ఆవిధంగా 'అన్యము' రూపంగా సమస్త జగద్వ్యవహారము కల్పించబడసాగుతోంది].
కామేశ్వరో వైశ్రవణో బ్రహ్మపుత్రో వాలఖిల్యః స్వయంభువమ్ పరిపృచ్ఛతి: "= జగతాం కా విద్యా? కా దేవతా? జాగ్రత్ తురీయయోః అస్య కో దేవః?	ఒక సమయంలో కామేశ్వరుడు, వైశ్రవణుడు, బ్రహ్మపుత్రుడు, వాలఖిల్యుడు అను నలుగురు ఋషులు బ్రహ్మదేవుని సమీపించి ఈవిధంగా అడిగారు. "తండ్రీ!" 1) ఈ సమస్త జగత్తులలో అత్యుత్తమమైన విద్య ఏది? 2) ఈ జగత్తులకు దేవతలు (Devine to all worlds) ఎవరు? జాగ్రత్‌కు దేవత ఎవరు? తురీయమునకు దేవత ఎవరు?
యాని తస్య వశాని? కాలాః కియత్ ప్రమాణాః? కస్య ఆజ్ఞయా రవి చంద్ర గ్రహాదయో భాసంతే? కస్య మహిమా గగనస్వరూపః?	(3) ఆ దేవత వశంగా ఏమేమి ఉన్నాయి? (4) కాలము ఎంత ప్రమాణము కలిగి ఉంటోంది? (5) ఎవ్వరి ఆజ్ఞచే ఆకాశంలో సూర్యుడు, చంద్రుడు, గ్రహములు మొ॥నవి (ఒకానొక విధి విధానంగా) భాసిస్తున్నాయి? (6) ఆకాశ స్వరూపముయొక్క 'మహిమ" ఎవ్వరిది?
ఏతత్ అహగ్ం శ్రోతుం ఇచ్ఛామి। న అన్యో జానాతి। త్వం బ్రూహి, బ్రహ్మన్!"	స్వామీ! స్వయంభూ! బ్రహ్మదేవా! ఈఈ విశేషాల వివరణలు మేము శ్రవణం చేయతలచి మిమ్ములను శరణువేడుచున్నాము. ఈఈ విశేషాలు మీరు మాత్రమే ఎరిగియున్నారు. అందుచేత దయతో మీరే వివరించి బోధించ ప్రార్థన.
2. స్వయంభూః ఉవాచ : కృత్స్న జగతాం మాతృకా విద్యా ద్వి - త్రి వర్ణ సహితా। ద్వివర్ణ మాత్రా। (ద్వివర్ణమాతా)।	బ్రహ్మదేవుడు : ఈ జగత్తుయొక్క ఉత్పత్తిని వివరించే **'మాతృకావిద్య'** రెండు - మూడు వర్ణములతో కూడి ఉన్నది. రెండు వర్ణములైన మాతృకలు, మూడు వర్ణములతో కూడినది, 'నాలుగు' తీరులైన చాతుర్మాత్రాత్మ ఏకము - అగు 'ఓం' కార రూపిణియే అయి ఉన్నది. **నాకు కూడా ప్రాణాత్మకమైన దేవత- ఆ మాతృకా విద్యయే.**

త్రివర్ణ ఉపేతా। చతుర్మాత్రాత్మక- 'ఓం' కార రూపిణీ। మమ ప్రాణాత్మికా దేవతా। అహమేవ జగత్ - త్రయైకః పతిః। మమ వశాని సర్వాణి యుగాన్యపి।	1) **"అ-మ"** ద్వివర్ణాత్మకము 2) **"అ-ఉ-మ"** త్రివర్ణాత్మకము 3) **"అ-ఉ-మ-హంస"** చాతుర్మాత్రాత్మకము (భూ-స్వర్గ-పాతాళ) త్రిజగత్తులకు ఏకైక పతిని, ప్రభువును నేనే। యుగములన్నీ నాకు వశమై (Under my control) ఉంటున్నాయి.
అహోరాత్రాదయో మత్ సంవర్ధితాః। కాలాః మమరూపం। రవేః తేజః చంద్ర నక్షత్ర గ్రహ తేజాంసి చ, గగనో - మమ త్రిశక్తి మాయా స్వరూపః।	రాత్రి-పగలు-అనేవి నాచే వృద్ధి చేయబడుచున్నట్టి, నాయొక్క కాలస్వరూపము. సూర్యతేజస్సు, చంద్రుడు, నక్షత్రములు, గ్రహములు, ఆకాశము - మొదలైనవన్నీ కూడా నాయొక్క మాయాస్వరూపమై ఆకాశమున వెలయుచున్నాయి.
నాన్యో మత్ - అస్తి। (నాన్యో మదస్తి)। - తమో మాయాత్మకో రుద్రః। - సాత్త్విక మాయాత్మకో విష్ణుః। - రాజస మాయత్మకో బ్రహ్మా। - ఇంద్రాదయః తామస రాజసాత్మికాః। న సాత్త్వికః కోఽపి। - అఘోరః సర్వసాధారణ స్వరూపః।	ఎక్కడా ఏదీ కూడా నాకు వేరుగా ఏమాత్రము లేదు. రుద్రుడు తమో మాయాత్మకుడు. విష్ణువు - సాత్త్విక మాయాత్మకుడు. బ్రహ్మయో - రాజస మాయాత్మకుడు. ఇంద్రుడు మొదలైన దేవతలంతా తామస - రాజసాత్మకులు. కేవల సాత్త్విక రూపుడు ఎవరూ లేరు. (ప్రకృతిలో ఉండరు). అఘోరము (సూక్ష్మరూపము) - సర్వ సాధారణ స్వరూపమైయున్నది. (స్థూలమంతా సూక్ష్మరూప ప్రదర్శనమే).
సమస్త యాగానాం → రుద్రః పశుపతిః → కర్తా। రుద్రో → యాగ దేవః। విష్ణుః → అధ్వర్యుః। హోతా → ఇంద్రః। దేవతా → యజ్ఞభుక్।	**సమస్త యాగములకు -** పశుపతి యగు రుద్రుడు → **కర్త**। రుద్రుడు → **యాగదేవుడు**। విష్ణువు → **అధ్వర్యుడు** (యజ్ఞమునందు మంత్ర విధానము నడుపువాడు)। ఇంద్రుడు → **హోత** (ఋక్కులు తెలిసిన ఋత్విక్కు, హోమము చేయువాడు)। దేవతలు → **యజ్ఞభోక్తలు**।
మానసం → బ్రహ్మా। మాహేశ్వరం → బ్రహ్మా। మానసగ్ం → హగ్ంసః। సోఽహగ్ం → 'హగ్ంస' ఇతి।	బ్రహ్మ → **మానసము (మనోరూపము)**। బ్రహ్మ → **మహేశ్వరుడు**। హంస → **మానసము**। హంస → **సోఽహమ్**।
తన్మయ → యజ్ఞో నాదానుసంధానమ్। తన్మయ వికారో → జీవః। పరమాత్మ స్వరూపో → హగ్ంసః।	తన్మయ (తత్ - మయ) → యజ్ఞము యొక్క నాదానుసంధానము తన్మయ వికారమే → ఈ **జీవుడు**। **'హంస' యే సోఽహమ్। అదియే పరమాత్మ స్వరూపము.**

3. అంతర్బహిః చరతి హగ్ంసః। **అంతర్గతో – అనవకాశాంతర్గత** **సువర్ణ స్వరూపో హగ్ంసః।**	హంసయే - బాహ్య అభ్యంతరములలో చరించునది. సమస్తమునకు అంతర్గతము. ఆకాశ - అనవకాశములకు కూడా అంతర్గతుడు ఎవరు? సువర్ణ స్వరూపుడగు **'హంస'** యే!
షణ్ణవతి (96) తత్త్వ తంతువత్ <u>వ్యక్తమ్</u>। **చిత్ సూత్రత్రయ <u>"చిన్మయలక్షణమ్"</u>।** **నవతత్త్వ <u>"త్రిరావృతమ్"</u>।**	అట్టి కేవలమగు హంస - '96' తత్త్వములతో - తంతువువలె (తామర తూడు దారమువలె) 'వ్యక్తము' (Manifested) అగుచున్నది. చిత్ సూత్రత్రయముతో 3 సూత్రములతో (**ఎరుగువాడు - ఎరుక - ఎరుగబడునది** లతో) కూడి **'హంస'** చిన్మయలక్షణుడు. **నవతత్త్వములతో** (నవ-ఆత్మగుణములు జ్ఞాన , సుఖ, దుఃఖ, ఇచ్ఛా ద్వేష, ప్రయత్న, ధర్మ, అధర్మ, సంస్కారములతో), మూడు పేటలతో (సత్త్వ-రజో-తమములతో) హం - త్రిరావృతమై- ఏర్పడి ఉంటోంది.
బ్రహ్మ విష్ణు మహేశ్వరాత్మకమ్। **అగ్నిత్రయ కళోపేతమ్।**	'హంస' ఇంకా కూడా, - బ్రహ్మ విష్ణు మహేశ్వరాత్మకము (సృష్టి - స్థితి - లయాత్మికము). (ఆహవనీయాగ్ని, దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని అనబడు) త్రిఅగ్నులు తనయొక్క కళలుగా (యజ్ఞమునందు) కలిగి ఉన్నట్టిది.
'చిత్' గ్రంథి బంధనమ్। **అద్వైత గ్రంథిః।**	చిత్ (ఎరుక - ఎరుగువాడు - ఎరుగబడునది) అనబడు గంధనములచే (ముడులచే) బంధనము కలిగి ఉంటోంది. (జీవాత్మ పరమాత్మల **పరస్పర అద్వితీయత్వము** అనే) **అద్వైత గ్రంథి** కలిగి ఉన్నట్టిది కూడా.
యజ్ఞ సాధారణాంగమ్। **బహిరంతః జ్వలనమ్।**	ఈ విశ్వమంతా తనయొక్క యజ్ఞరూపముగా సాధారణమైన అంగముగా కలిగి ఉన్నట్టిది - **హంస।** బాహ్య - అభ్యంతరములుగా వెలుగొందుచున్నట్టిది - హంస.
<u>యజ్ఞాంగ లక్షణ</u> – బ్రహ్మస్వరూపో హగ్ంసః। **<u>ఉపవీత లక్షణ</u> సూత్ర బ్రహ్మగా యజ్ఞాః।**	హంసయే [ఆత్మయే (లేక) బ్రహ్మమే] - ఈ సమస్తమును తన స్వరూపముగా కలిగి, యజ్ఞాంగములు తన లక్షణములుగా కలిగి ఉన్నట్టిది. **'యజ్ఞము'** - సూత్రబ్రహ్మగతమై ఉపవీత లక్షణములు కలిగి ఉన్నట్టిది.
<u>బ్రహ్మాంగ లక్షణయుక్తో</u> – యజ్ఞసూత్రమ్। **తత్ బ్రహ్మసూత్రమ్,** **యజ్ఞసూత్ర సంబంధీ – <u>బ్రహ్మయజ్ఞః</u>।**	**యజ్ఞసూత్రము:** బ్రహ్మము యొక్క ద్రష్ట - దర్శన - దృశ్య - దృక్ బ్రహ్మాంగలక్షణముల- సంజ్ఞ. అదియే (తత్త్వరూపమే) బ్రహ్మ సూత్రము 'యజ్ఞసూత్ర' సంబంధముగా **'బ్రహ్మయజ్ఞము'** అనబడుతోంది.
తత్స్వరూపః। **అంగాని మాత్రాణి।** **మనోయజ్ఞస్య హగ్ంసో – <u>యజ్ఞసూత్రమ్</u>।**	అద్దాని అంగములు - శబ్ద స్పర్శ రూప రస గంధములనబడే పంచ తన్మాత్రలు. మనస్సుతో చేసే మనో యజ్ఞమునకు హంస (సోఽహమ్) యే యజ్ఞ సూత్రము.
ప్రణవం బ్రహ్మసూత్రం బ్రహ్మయజ్ఞమయమ్। **ప్రణవ – అంతర్వర్తీ హగ్ంసో –** **<u>"బ్రహ్మసూత్రమ్।"</u>**	'ఓం' (అ+ఉ+మ+హంస) అను ప్రణవము - బ్రహ్మ యజ్ఞమునందు బ్రహ్మసూత్రము. ప్రణవ - అంతర్వర్తి (అంతరంగా వర్తించుననది) అగు హంసయే (సోఽహమ్‌యే) - **బ్రహ్మసూత్రము.**

తదేవ బ్రహ్మయజ్ఞమయమ్। మోక్షక్రమమ్। బ్రహ్మసంధ్యా క్రియా, మనో యాగః। 'సంధ్యాక్రియా' మనోయాగస్య లక్షణమ్।	- ఇవన్నీ "బ్రహ్మసంధ్యా క్రియలు". "మనో యాగము". **బ్రహ్మయజ్ఞమయ విశేషములు.** మోక్షమునకు క్రమ విధానము. మనో యాగము యొక్క లక్షణ విశేషమే **"సంధ్యాక్రియ"**.
యజ్ఞసూత్ర ప్రణవ బ్రహ్మయజ్ఞ క్రియాయుక్తో బ్రాహ్మణః। బ్రహ్మచర్యేణ చరంతి దేవాః॥	**యజ్ఞసూత్రము, ప్రణవోపాసన, బ్రహ్మయజ్ఞము** - అను క్రియలు - **'బ్రాహ్మణము'** - అనబడుచున్నాయి. నిర్వర్తించువారు బ్రాహ్మణులు. దేవతలు బ్రహ్మమునందు ఆచరణ కలిగి ఉన్నారు.
4. హగ్ంస సూత్రచర్యా యజ్ఞాః। హంస - ప్రణవయోః అభేదః। హంసస్య ప్రార్థనాః త్రికాలాః। త్రికాలాః త్రివర్ణాః।	'హంస' (ఆత్మ, సోఽహమ్) యొక్క సూత్ర (Indicative) చర్యలు **"యజ్ఞములు"**. హంస, ప్రణవము అభేదమైనవి. ఏకరూపము కలిగినట్టివి. **హంసయొక్క ప్రార్థనా రూపములే త్రికాలములు.** త్రికాలములు (భూత-వర్తమాన-భవిష్యత్ కాలములు) ఆత్మకు త్రివర్ణములు (3 రంగులు) వంటివి.
త్రేతాగ్ని (గ్న్యున్) అనుసంధానో యాగః। త్రేతాగ్న్య ఆత్మాకృతి వర్ణ 'ఓం' కార హగ్ంస అనుసంధానో అంతర్యాగః।	(గార్హపత్యము, దక్షిణాగ్ని, ఆహవనీయము అనబడు) త్రేతాగ్నుల (అగ్నిత్రయము యొక్క) అనుసంధానమే 'యాగము'. (త్రైతాగ్నులైనట్టి జీవాత్మ, ఈశ్వరుడు, పరమాత్మల) - త్రైతాగ్నుల ఏకాత్మకృతి వర్ణనయే 'ఓంకారము'. అట్టి త్రేతాగ్నుల ఆత్మకృతి వర్ణము - ఓంకారముతో అనుసంధానమే **'అంతర్యాగము'**.
చిత్ - స్వరూప సత్ తన్మయం తురీయ స్వరూపమ్।	చిత్ స్వరూపముతో కూడిన సత్-తన్మయమే **"తురీయస్వరూపము"** (జాగ్రత్ స్వప్న సుషుప్తులకు సాక్షి అయి, ఆ మూడిటిని సంచార స్థానములుగా కలిగి ఉన్నట్టిది - 'తురీయము').
అంతరాదిత్యే జ్యోతిస్స్వరూపో హగ్ంసః। యజ్ఞాంగం బ్రహ్మ సంపత్తిః। బ్రహ్మ ప్రవృత్తౌ తత్ ప్రణవహంస సూత్రేణైవ ధ్యానమ్ ఆచరంతి।	అంతర్గమైయున్న ఆదిత్యుని జ్యోతి స్వరూపమే **'హంస'**. బ్రహ్మసంపత్తియే (బ్రహ్మతత్త్వజ్ఞానమే) యజ్ఞములో ముఖ్యమైన సంపత్తి. (సంపదా విశేషము). ప్రణవము (ఓంకారము) ధ్యానించేడప్పుడు అది బ్రహ్మసంపత్తికి సూత్రముగా ధ్యానిస్తూ, **బ్రహ్మభావనయే ఆచారణగా కలిగి ఉండటము-** "బ్రహ్మ ప్రవృత్తి".
ప్రోవాచ పునః స్వయంభువం: ప్రతిజానీతే బ్రహ్మపుత్రో, ఋషిః వాలఖిల్యః : హంససూత్రాణి కతిసంఖ్యాని? కియద్వా ప్రమాణమ్?	**ఇంకా బ్రహ్మ మానసపుత్రుడగు వాలఖిల్యమహర్షి - స్వయంభువు, ప్రజాపతి అగు బ్రహ్మదేవుల వారిని ఈవిధంగా అడిగారు.** హంస సూత్రములు ఎన్ని? దానికి ప్రమాణము ఏమిటి?
(స్వయంభువౌ వాచ): హృత్ ఆదిత్య మరీచీనాం పదం షణ్ణవతిః (96)। చిత్ సూత్ర ఘ్రాణయో, స్వర నిర్గతా, ప్రణవధారా షట్ (6) అంగుళదళా అశీతిః।	**శ్రీ స్వయంభువు ఈ విధంగా వివరించారు.** "హృదయము" అనే సూర్యుని యొక్క కిరణములు (ప్రసరణ స్థానములు) - '96'. చిత్ సూత్రము - అనే ఘ్రాణము (వాయుసంచలము) యొక్క స్వర నిర్గతమైన ప్రణవాధారములు '6' అంగుళముల విస్తీర్ణతతో '80' దళములు.

వామబాహు దక్షిణకట్యోః అంతశ్చరతి హగ్ంసః పరమాత్మా। బ్రహ్మ గుహ్య ప్రకారో న అన్యత్ర విదితః।	**ఎడమ భుజమునకు - కుడికంటికి (కుడి మొల ప్రదేశమునకు) మధ్యగా హంసరూపుడగు పరమాత్మ సంచారము కలిగి ఉన్నారు.** **"బ్రహ్మగుహ్యప్రకారమును"** (బ్రహ్మతత్త్వ రహస్యమును) అనుసరించి 'అన్యత్ర' తెలియబడడంలేదు. (ఆత్మ అనన్యము, ఆత్మకు వేరుగా ఏదీ లేదు).
యే జానంతి, తే అమృతఫలకాః। సర్వకాలగ్ం హంస ప్రకాశకమ్।	**"ఆత్మకు వేరుగా ఏదీ లేదు"** అను అనన్యత్వమును ఎరిగినవారు అమృత ఫలము పొందినవారగుచున్నారు. (త్రికాలములు అనబడే) సర్వ కాలములందు హంస (ఆత్మ) ఈ సమస్తముగా ప్రకాశమానమై ఉన్నది.
ప్రణవ హంసా అంతర్ధ్యాన ప్రకృతిం వినా న ముక్తిః। నవ సూత్రాన్ పరిచర్చితాన్। తేఽపి యత్ బ్రహ్మ చరంతి, అంతరాదిత్యం న జ్ఞాతం మనుష్యాణామ్।	ప్రణవ హంస (The Comprehensive Self of every self) - యొక్క అంతరధ్యానముగా సమస్త ప్రకృతిని దర్శించటమునకు వేరుగా 'ముక్తి'కి నిర్వచనము లేదు. **సమస్తము స్వస్వరూపాత్మగా అనునిత్యము సందర్శించటమే 'ముక్తి'**. మరొకటేదీ కాదు. ఎవరైతే నవ (9) సూత్రములను పరిచర్చించి ఇది ఎరుగుచున్నారో, అట్టి వారు స్వాభావికముగా బ్రహ్మమునందు చరించుచున్న వారగుచున్నారు. మానుష (ఇంద్రియ పరిమిత, దృశ్య పరిమిత) దృష్టిచే అంతరాదిత్యుని (అంతర సూర్యుడగు ఆత్మను) ఎరుగజాలకున్నారు.
"జగదాదిత్యో రోచత" ఇతి। జ్ఞాత్వా తే మర్త్యా విబుధాః। తపన ప్రార్థనాయుక్తా ఆచరంతి।	**"ఈ జగత్తు అంతరాదిత్యుని (ఆత్మ పురుషుని) రుచికర ప్రదర్శనము"** - అని ఎరిగినవారు విభుదులై (తెలివి కలవారై), ఆత్మయందే ప్రార్థనాయుక్తమైన తపన (తపస్సు)ను ఆచరిస్తూ ఉంటారు.
5. వాజపేయః పశుకర్తా – ఆధ్వర్యుః। ఇంద్రో – దేవతా। అహిగ్ంసా – ధర్మయాగః పరమ హగ్ంసో అధ్వర్యుః।	వాజపేయ ఆత్మయజ్ఞము నందు, ఇంద్రియ పశువులను పాలించు పశు కర్త (పశుపతి)యే - **ఆధ్వర్యుడు.** (యజుర్వేద మంత్రాలు చదువువాడు). ఇంద్రుడు - **దేవత.** అహింసయే - **ధర్మయాగము.** పరమహంసయే - **ఆధర్వ్యుడు.** (సోఽహమ్ పరమమ్ **"కేవలముగు నేనే నేను"** అనునదే **పరమహంస స్థితి**).
పరమాత్మా దేవతా – పశుపతిః। బ్రహ్మోపనిషదో బ్రహ్మా। స్వాధ్యాయ యుక్తా – బ్రాహ్మణాః చరంతి।	పరమాత్మయే - **పశుపతి దేవత.** (ఇంద్రియములకు నియామకుడు, అధినేత). బ్రహ్మోపనిషత్తులు - బ్రహ్మ. బ్రాహ్మణులు - బ్రహ్మము గురించిన **స్వాధ్యాయయుక్తులుగా చరించు వారు.** (బ్రహ్మము గురించి అధ్యయనముచేస్తూ, ఎలుగెత్తి గానము ప్రకటించువారు). { **హెూత = ఋగ్వేద మంత్రములు చదువు వారు.** **ఉద్గాత = సామవేదమంత్రాలను గానం చేయువాడు.** **ఆధ్వర్యుడు** = యజుర్వేద వేదమంత్రాలను ఉచ్ఛరించువాడు. **బ్రహ్మ** = అథర్వణ వేదమంత్రాలను పలుకువారు. (ఆధ్వర్యుడు ముఖ్యుడు. యజ్ఞము మొత్తాన్ని ఏ పొరపాటు లేకుండా జరిపించువారు) ఋత్విక్కులు = యజ్ఞములోని తక్కిన అనేక కార్యక్రమములు నడిపించు వారు. [ఉదా: అగ్నీధ్రుడు, ప్రతిప్రస్థాత, నేష్ట, ఉపద్రష్ట మొ॥వారు] }

అశ్వమేధో → **మహాయజ్ఞ కథా।** **తద్రాజ్ఞా (తత్ రాజ్ఞా)** **బ్రహ్మచర్యమ్ ఆచరంతి।**	"అశ్వమేధము" - అనునది మహాయజ్ఞ కథా సంవిధానముగా మనము చెప్పుకొంటున్నాము. అశ్వమేధము నిర్వర్తించు రాజు బ్రహ్మచర్యము ఆచరించటమును (అశ్వము ఆత్మజ్ఞానముగాను, విధానము మనోఅశ్వ సంచార విజయముగాను) ఎరుగుదురుగాక।
సర్వేషాం పూర్వోక్త బ్రహ్మయజ్ఞక్రమం **ముక్తిక్రమమ్ ఇతి।**	"బ్రహ్మయజ్ఞము" అని (వేద వాఙ్మయంలో) వివరించబడుచున్నదంతా 'క్రమముక్తి' విధానము.
బ్రహ్మపుత్రః - ప్రోవాచ। **ఉదితో హగ్ంస ఋషిః।** **స్వయంభూః తిరోదధే** **రుద్రోపనిషదో హగ్ంస జ్యోతిః పశుపతిః।**	పూర్వోక్తమైన బ్రహ్మయజ్ఞక్రమము ముక్తిప్రదమని పలుకుచు, బ్రహ్మ మానస పుత్రులకు బ్రహ్మదేవుడు ఇంకా చెప్పసాగారు. హంసఋషి ఉదయించగానే స్వయంభువు తిరోధానము (అంతర్ధానము) అగుచున్నాడు. అనగా, సృష్టి క్రమమంతా కల్పిత మాత్రమే అగుచున్నది, సృష్టి, సృష్ట్యనుభవము కూడా కల్పితమాత్ర అసహజ సత్యముగా తెలియవస్తున్నది. 'రుద్రోపనిషత్'లో వర్ణించబడిన హంస జ్యోతియే పశుపతి।
ప్రణవః తారకః। **స ఏవం వేద హగ్ంసాత్మ** **మాలికావర్ణ బ్రహ్మకాల ప్రచోదితా।**	ప్రణవము (అ+ఉ+మ = ఓం) - తారకము (తరింపజేయునది). ఈవిధంగా ఎవడు తెలుసుకుంటాడో అట్టివాడు -**'హంసాత్మక మాలికావర్ణ బ్రహ్మకాల ప్రచోదితుడు'** అగుచున్నాడు.
పరమాత్మా పుమాన్ ఇతి। **బ్రహ్మసమ్పత్తి కారిణీ।** **అధ్యాత్మ బ్రహ్మకల్పస్య ఆకృతిః।**	పరమాత్మయే పురుషుడు। బ్రహ్మసంపత్తి (ప్రకృతియే) సమస్తమునకు కారణము. అధ్యాత్మము - బ్రహ్మకల్పన'కు ఆకారము (ఆకృతి).
కీదృశీ, కథా బ్రహ్మజ్ఞాన ప్రభా **సన్ధ్యాకాలో గచ్ఛతి ధీమతామ్?** **హంసాఖ్యో దేవమ్।** **ఆత్మాఖ్యమ్।** **ఆత్మతత్త్వ ప్రజాకథమ్।**	అట్టి ఆధ్యాత్మము ఏవిధంగా కనబడుచున్నది? ధీమంతులు సంధ్యాకాలము ప్రవేశించి బ్రహ్మజ్ఞాన ప్రభ ఏమని పొందారు? 'హంసాఖ్యుడు' అనే ఆయన [(లేక) హంస-సోహం అధ్యయనుడు] ప్రజాకథనమగు ఆత్మతత్త్వ దేవుని కథను (కథనమును) (తమ తపస్సు ద్వారా) ఎరిగి లోకమునకు చాటిచెప్పారు. 'హంస'యే దేవత. హంసయే 'ఆత్మ' గురించిన వివరణ. హంసయే ఆత్మతత్త్వ ప్రజా కథనము.
అంతః ప్రణవ నాదాఖ్యో **హంసః ప్రత్యయ బోధకః।** **'అంతర్గత ప్రమా' గూఢం** **జ్ఞాననాళం విరాజితమ్।**	అంతరములోని ప్రణవనాదాఖ్యుడే (Inner voice expressor) హంస - ప్రత్యయ బోధకుడు. అంతర్గత (కేవల) బుద్ధియందు రహస్యముగా (గూఢముగా) ప్రకాశించు చున్నట్టిది, జ్ఞాన నాళములో విరాజిల్లుచున్నట్టిది - **హంస (జీవాత్మ).**
శివ శక్త్యాత్మకం రూపం **చిన్మయానంద వేదితమ్।** **'నాద బిందు కళా' త్రీణి** **నేత్రం విశ్వ విచేష్టితమ్।।**	శివ - శక్త్యాత్మకరూపమే - పురుష ప్రకృతి, చిన్మయానందముగా (I & My) తెలియబడుతోంది. అట్టి చిన్మయానందము "నాద-బిందు-కళలు" (Sound, Pin and Art) అనే త్రినేత్రములతో విశ్వముగా నిర్మితమై ప్రదర్శితమై యున్నది.
6. త్రియంగాని, శిఖా త్రీణి, **ద్విత్రాణాం సాంఖ్యమ్ ఆకృతిః।** **అంతర్గూఢ 'ప్రమా' హంసః** **ప్రమాణాత్ నిర్గతం బహిః।**	సాంఖ్యము (జ్ఞానవిచారణ) కు త్రి అంగములు **(జగత్ స్వప్న సుషుప్తులు),** (జగత్-జీవ ఈశ్వరులనబడే) త్రిశిఖలు. "2-3"- ఆకృతులు ఉంటోంది. అంతర్గూఢంగా గల 'ప్రమ' (యదార్థమగు ఆత్మ)యే "హంస". అట్టి **అంతర్గూఢాత్మయే ప్రమాణము** (As an appearance)గా **జగత్తు అయి బహిర్గతమౌతోంది.**

బ్రహ్మసూత్రపదం జ్ఞేయం బ్రాహ్మ్యం విధ్యుక్త లక్షణమ్। హంసాఖ్య ప్రణవ ధ్యానమ్ ఇత్యుక్తో జ్ఞానసాగరే। ఏతత్ విజ్ఞానమాత్రేణ జ్ఞాన సాగర పారగః।	"ఈ సమస్తము బ్రహ్మము యొక్క విధ్యుక్త లక్షణ విశేషమే" - (All this is the duly exhibited quality of 'Brahman') - అను అవగాహనయే **బ్రహ్మ సూత్ర పదము.** హంసాఖ్యమైన ప్రణవ ధ్యానమే (ఆత్మ) జ్ఞానసాగరముగా చెప్పబడుతోంది. ఈ మాత్రము తెలుసుకున్నంత మాత్రం చేత ఈ జీవుడు జ్ఞానసాగర పారగుడు అగుచున్నాడు.
స్వతశ్శివః పశుపతిః సాక్షీ, సర్వస్య సర్వదా సర్వేషాం తు మనః తేన ప్రేరితం నియమేన తు। విషయే గచ్ఛతి ప్రాణః చేష్టతే వాక్ - వదత్యపి।	ఈ జీవుడు స్వతఃగా శివుడే. **శివతత్త్వమ్। శివోఽహమ్।** అట్టి పశుపతియే కేవల సాక్షి. ఆ స్వతఃశివుడగు పశుపతి చైతన్యమే సర్వ దేహములలో, సమస్త జీవులయొక్క మనోరూపమై నియమానుసారంగా సమస్త జీవులను ప్రేరితము (Inspired) చేయుచున్నది. ప్రాణము ఇంద్రియ విషయములవైపుగా వెళ్లుచున్నది. వాక్కు మాట్లాడు చేష్ట కలిగి ఉంటోంది.
చక్షుః పశ్యతి రూపాణి శ్రోత్రం సర్వం శృణోత్యపి, అన్యాని ఖాని సర్వాణి తేనైవ ప్రేరితాని తు।	కళ్లు రూపములను చూస్తూ ఉన్నది. చెవులు సమస్త శబ్దాలను వింటూ ఉన్నది. అట్లాగే సమస్త ఇంద్రియములు ప్రాణశక్తిచేతనే ప్రేరణపొందు చున్నాయి. విషయముల కల్పనచే జగత్తుగా అనుభవము పొందుచున్నాయి. **ప్రాణేశ్వరుని ప్రాణశక్తి ప్రేరణయే ఇదంతా!**
స్వం స్వం విషయం ఉద్దిశ్య ప్రవర్తంతే నిరంతరమ్। ప్రవర్తకత్వంచాపి అస్య మాయయా, న స్వభావతః।	ఆవిధంగా ఇంద్రియములన్నీ కూడా వాటి వాటి విషయముల గురించి నిరంతరము (ప్రాణశక్తివలన) ప్రవర్తన కలిగి ఉంటున్నాయి. ఏ జీవుడైతే అట్టి ఇంద్రియములతో, విషయముల పట్ల ప్రవర్తకుడై ఉన్నాడో అదంతా 'మాయ' చేతనే. అంతేగాని, ఇంద్రియ విషయాను సంధానము - అనేది ఈ జీవుని సహజస్వభావము కాదు. (ఆత్మత్వమే సహజ స్వభావము).
శ్రోత్రమ్ ఆత్మని చ అధ్యస్తం। స్వయం పశుపతిః పుమాన్।	వినికిడి (Hearing) అనునది అధ్యస్తము (Inner Placed) అయి ఉన్నది **- ఆత్మయందే.** ఇక ఈ పురుషుడు (జీవుడు) స్వయముగా పశుపతి (శివ) స్వరూపుడే.
అనుప్రవిశ్య శ్రోత్రస్య దదాతి శ్రోత్రతాం శివః। మనః స్వాత్మని చ అధ్యస్తం ప్రవిశ్య పరమేశ్వరః।	తన చమత్కారమగుశక్తిచే శివుడు శ్రోత్రమును అనుసరించినవాడై చెవులకు వినికిడి (Hearing)ని ప్రసాదిస్తున్నారు. **వినబడు విషయములు కూడా శివచైతన్యమే.** పరమేశ్వరుడు ప్రవేశించి మనస్సును ఆత్మయందు అధ్యస్తముగా (As Inner Placed) కలిగి ఉంటున్నాడు.
మనస్త్వం తస్య సత్త్వస్థో దదాతి నియమేవ(న) తు। స ఏవ విదితాత్ అన్యః తథైవ అవిదితాత్-అపి।	పరమేశ్వరుడే సత్త్వస్థుడై (ఉనికి ప్రదర్శనా సంకల్పుడై) మనస్సును ప్రసాదించువాడై ఉంటున్నారు. **ఈ జీవుడు తెలియబడేదానికి, తెలియబడనిదానికి కూడా వేరుగా పరమాత్మస్వరూపుడై ఉన్నాడు.**
అన్యేషాం ఇంద్రియాణాం తు కల్పితానామపి ఈశ్వరః।	ఈశ్వరుడు కల్పితమే అయినట్టి తదితర ఇంద్రియములుగా కూడా విస్తరించువారై ఉన్నారు.

తత్ తత్ రూపమ్ అనుప్రాప్య **దదాతి నియమేన తు।**	ఈశ్వరుడే - ఆయా చెవులు, కళ్లు మొదలైన ఇంద్రియములను విశేషములుగా కల్పించుకొని, పొంది, ప్రవేశించి, - **వాటియందు ఇంద్రియానుభవములను నియమించుచున్నారు.**
తతః చక్షుశ్చ వాక్చైవ **మనశ్చ అన్యాని ఖాని చ।** **<u>న గచ్ఛంతి స్వయంజ్యోతిః</u>** **<u>స్వభావే పరమాత్మని॥</u>**	పరమాత్మచే స్వయం కృతంగా నియమించబడిన కళ్లు, చెవులు, తదితరములన్నీ స్వయం జ్యోతి స్వభావుడగు పరమాత్మను కప్పి ఉంచ గలవా? లేనే లేదు. (అవి ప్రకృతిలోని విశేషములు మాత్రమే అయి ఉంటాయేగాని), ఇంద్రియములు పరమాత్మను పొందలేవు, చేరలేవు, కప్పి ఉంచలేవు.
7. అకర్తృ విషయ ప్రత్యక్ **ప్రకాశం స్వాత్మనైవతు।** **వినా తర్క ప్రమాణాభ్యాం** **బ్రహ్మయో వేద వేదసః।**	ఈ జగత్ దృశ్యరూపంగా సిద్ధిస్తున్న ఇంద్రియ విషయములు స్వయం కర్తృత్వములు కావు. అవి జడములు మాత్రమే. అవన్నీ కూడా స్వాత్మయొక్క చైతన్య ప్రకాశము చేతనే అనుభూతి రూపంగా రూపుదిద్దుకొని ఉంటున్నాయి. సమస్త తర్క ప్రమాణములు (Logics and standardized views) దాటిపోయి, ఎవ్వడైతే అట్టి ఆత్మను తెలుసుకుంటాడో, అట్టివాడు సమస్తము గురించి తెలుసుకొన్నవాడు అగుచున్నాడు.
ప్రత్యగాత్మా పరంజ్యోతిః **మాయా సా తు మహత్తమః।** **తథా సతి కథం మాయా సంభవః** **ప్రత్యగాత్మని?**	ప్రత్యగాత్మ (సమస్తమునకు వేరైనట్టి ఆత్మ) **పరంజ్యోతి స్వరూపము.** అట్టి ఆత్మ యొక్క మాయ మహత్ తమమైనది. (Superlatively మహిమ గలది) . అయితే అత్యంత **నిర్మలము, మహత్తమము, కేవలము, అద్వితీయము** అగు ప్రత్యగాత్మ యందు "మాయ" అనునది మాత్రం ఎట్లా సంభవం? (దర్పణంలో వస్తువులు కనిపిస్తూ ఉన్నప్పటికీ, దర్పణంలో అవి ఉండవు కదా!)
తస్మాత్ తర్క ప్రమాణాభ్యాం **స్వానుభూత్యా చ చిద్ఘనే।** **స్వప్రకాశైక సంసిద్ధే** **నాస్తి మాయా పరాత్మని।**	కాబట్టి, ఈ జీవుడు శాస్త్ర ప్రమాణ పూర్వక తర్కముచేతను, స్వానుభవము చేతను **తనయందే 'చిద్ఘనము'ను దర్శించును గాక। సిద్ధించుకొనును గాక।** (అంతేగాని, మనోదర్పణమునందో, జగద్దృశ్యమునందో-కాదు). స్వయంప్రకాశము అయి పరాత్మ తనయందే స్వానుభవముగా ఆత్మభావనగా సంసిద్ధము అగుచుండగా, అద్దానియందు 'మాయ'కు చోటెక్కడిది? ('మాయ' అనగా 'యామా' - స్వతఃగా లేనిదే అగుచున్నది).
వ్యావహారిక దృష్ట్యా **అయం విద్యా-అవిద్యా।** **న చ అన్యథా...।**	**వ్యావహారిక దృష్ట్యా మాత్రమే "విద్య, అవిద్య, మాయ" మొదలైనవి ఉన్నట్లుగా అనిపిస్తోంది. అన్యథా (వస్తుతః, వాస్తవానికి) - అవి లేవు.**
తత్త్వ దృష్ట్యాతు నాస్త్యేవ **<u>తత్త్వమేవ అస్తి కేవలమ్।</u>**	తత్త్వ దృష్ట్యా చూచినపుడు కేవలమగు "తత్ త్వమ్" మాత్రమే ఉన్నది. మాయ, విద్య, అవిద్య-ఇవన్నీ **"వ్యావహారికదృష్టి"** మాత్రమే. **"ఆత్మప్రకాశము"** యొక్క వెలుగు చమత్కారమేగాని, ఆత్మకు వేరుగా వ్యావహారికమైనదంతా మొదలే లేదు. (అందుకే అవన్నీ జ్ఞాన బోధకు ఉపయోగించుకొని, ఆ తరువాత విడచివేసియే ఉండాలి).
వ్యావహారిక దృష్టిస్తు **ప్రకాశ అవ్యభిచారతః।** **ప్రకాశ ఏవ సతతం** **తస్మాత్ మౌనం హి యుజ్యతే।**	వ్యావహారిక, తదితర - సమస్త సందర్భములలోను (సతతము) నిర్విషయ, మౌన ఆత్మప్రకాశమే సర్వత్రా ఏర్పడినదై ఉన్నది. ఎప్పటికీ ప్రకాశము ఉండియే తీరుతోంది కాబట్టి, అది విషయములకు ఆవలిది కనుక **'మౌనము'** - అని వర్ణించబడుతోంది.

అయమ్ అర్థో, మహాన్ యస్య
స్వయమేవ ప్రకాశితః
న స జీవో। న చ బ్రహ్మ।
న చ అన్యదపి కిన్చన।
న తస్య వర్ణా విద్యంతే
న ఆశ్రమాశ్చ తథైవ చ ।
న తస్య ధర్మో అధర్మశ్చ
న నిషేధో విధిః న చ ॥

ఎవనిపట్ల అయితే - "ఆత్మయే ఉన్నది. వ్యావహారికమైన విద్య అవిద్య మాయ అనునవే - స్వతఃగా లేనే లేవు" - అను మహత్తరమగు అర్థము స్వాభావికంగాను, **స్వయముగాను ప్రకాశితమై ఉంటుందో, - అట్టివాడు ఇక జీవుడు కాడు.** (శబ్దరూపమగు) బ్రహ్మము కాదు. మరింకేమీకూడా కాదు. ఆతనిపట్ల వర్ణాశ్రమ ధర్మములు మొదలైనవన్నీ లేనివే అగుచున్నాయి.

ఆతనికి సంబంధించి విధి (Dos) లేదు. నిషేధము (Don'ts) ఉండ జాలవు. ధర్మము, అధర్మము అనునవి కూడా ఉండజాలవు.

---

8. యదా బ్రహ్మాత్మకం సర్వం
విభాతి స్వత ఏవ తు
తదా దుఃఖాది భేదో అయమ్
ఆభాసోఽపి న భాసతే।

ఎప్పుడైతే ఈ లోకములు, ఈ జగత్తులుగా కనిపిస్తున్నదంతా కూడా స్వతఃగానే బ్రహ్మాత్మకముగా ప్రకాశమానమౌతుందో (అనుభవైక వేద్యమౌతుందో, తెలియవస్తుందో), **అప్పుడిక దుఃఖముల అభాస కించిత్ కూడా భాసించదు.**

జగత్ - జీవాదిరూపేణ
పశ్యన్ అపి పరాత్మవిత్,
న తత్ పశ్యతి చిద్రూపం
బ్రహ్మవస్తు-ఇతి పశ్యతి।
ధర్మ ధర్మిత్వ వార్తా చ
భేదే సతి హి భిద్యతే।

"పరాత్మవేత్త" - ఇక్కడ జగత్తు, జీవుడు మొదలైన రూపములుగా చూస్తూ ఉన్నప్పటికీ, వాటినన్నిటినీ జగత్ జీవాత్మ భేదముతో చూడడు. ఇదంతా చిద్రూప - పరబ్రహ్మ వస్తువుగానే (బ్రహ్మ పదార్థంగానే) సర్వదా దర్శిస్తూ ఉంటాడు. ఆతనిపట్ల అనేకమంతా ఏకదృష్టియే అగుచున్నది.

ధర్మము - ధర్మిల మధ్యగల భేదవార్తలన్నీ ఆతనిపట్ల చెదిరిపోయినవి అవుతాయి.

భేద - అభేదః తథా
భేదాభేదః సాక్షాత్ పరాత్మనః।
నాస్తి స్వాత్మ అతిరేకేణ
స్వయమేవ అస్తి సర్వదా।
బ్రహ్మైవ విద్యతే సాక్షాత్
వస్తుతో, అవస్తుతోఽపి చ।

బేధ అభేదములన్నీ, భేదాభేదములకు ఆవలివాడగు పరమాత్మయొక్క సమక్షంలో స్వతఃగానే వీగిపోతాయి.

ఆత్మకు వేరై ఎక్కడా ఏదీ ఏకించిత్ కూడా మొదలే లేదు. ఆత్మయే స్వయముగా సర్వదా సర్వత్రా వేంచేసినదై యున్నది.

వస్తువుగాను, అవస్తువుగాను ఉన్నదంతా కూడా సాక్షాత్ బ్రహ్మమే అయి ఉన్నది.

తదైవ బ్రహ్మవిత్ జ్ఞానీ
కిం గృహ్ణాతి? జహాతి కిం?
అధిష్ఠానమ్। అనౌపమ్యమ్।
అవాక్-మానస గోచరమ్।

అట్టి బ్రహ్మము గురించి ఎరిగియున్న బ్రహ్మజ్ఞాని ఈ దృశ్య జగత్తులో దేనిని స్వీకరిస్తాడు? దేనిని వదులుతాడు? ఏదీ స్వీకరించడు, వదలడు.

బంగారు ఆభరణములకు బంగారము వలెనే, - **పరబ్రహ్మము సమస్తమునకు అధిష్ఠానమైనట్టిది. ఏ ఉపమానములతోను నిర్దేశించి చెప్పబడజాలదు. (వాక్కుకు మనస్సును అందక) అవాక్-మానస గోచరమైనట్టిది.**

యత్ తత్ అద్రేశ్యమ్,
అగ్రాహ్యమ్, అగోత్రమ్, రూపవర్జితమ్,
అచక్షుః శ్రోత్రమ్ అత్యర్థం
తత్ అపాణిపాదం తథా,

ఏదేదైతే దృశ్యములో కనబడే ఒకానొక వస్తు దృశ్య వంటిది కాదో, ఆలోచనలకు అగ్రాహ్యమో (గ్రహించరానిదో), గోత్రవిభాగసంబంధమైనది కాదో, రూపములేనట్టిదో, కళ్లకు కనబడనిదో, వినికిడిచే అర్థము కానిదో దేనికి కాళ్లు చేతులు లేవో (రాకపోకల కదలికలు లేవో...),

(అదియే ఆత్మతత్త్వము).

నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మంచ్చ తత్ అవ్యయమ్। బ్రహ్మైవ ఇదం అమృతం తత్ పురస్తాత్ బ్రహ్మానందం। పరమంచైవ పశ్చాత్।	ఏది త్రికాలములలోను **నిత్యము - అనునిత్యము అయి ఉన్నట్టిదో,** (రాజ్యమునకు 'రాజు' వలె) ఏది సమస్తమునకు **విభువో,** (కథా రచయిత కథలో వలె) ఏది **సర్వగతమో,** (సాకారము కంటే కూడా) **సూక్ష్మాతి సూక్ష్మమో,** ఏది 'వ్యయము' (Spent off) అనే ధర్మము లేనిదై, **అవ్యయమో** - అట్టి అమృతరూపమగు బ్రహ్మమే ఇదంతా, ఈ సమస్తము కూడా!
బ్రహ్మానందం పరమం దక్షిణే చ। బ్రహ్మానందం పరమం చ ఉత్తరే చ।	**<u>అట్టి పరబ్రహ్మమునకు</u>** ❑ ముందుగా ఉన్న రూపము బ్రహ్మానందము ❑ తరువాత ఉన్నది - 'పరమానందము' — — — — — — — — — — — — — 📖 దక్షిణముగా ఉన్నది - పరమగు బ్రహ్మానందము 📖 ఉత్తరముగా ఉన్నది - పరమగు ఆ బ్రహ్మానందమే। **అన్నివైపులా బ్రహ్మానందమే ఆక్రమించి ఉన్నది. బ్రహ్మానందమే అద్దాని స్వాభావిక విన్యాసము.**
9. <u>స్వాత్మన్యేన స్వయం సర్వం</u> <u>సదా పశ్యతి నిర్భయః।</u> తదా ముక్తో, న ముక్తశ్చ బద్ధస్యైవ విముక్తతా।	ఆత్మదర్శి తన ఆత్మయందే ఈ సమస్తమును స్వయముగా నిర్భయముగా, నిస్సంసయముగా దర్శిస్తున్నాడు. అట్టివాడు ముక్తుడే అయినప్పటికీ తన యందు దర్శించే ఈ జగత్తులను విడువనివాడే కనుక అముక్తుడే. సమస్తము నుండి విముక్తుడే అయి కూడా ఏదీ వదలటము లేదు కాబట్టి బద్ధుడు కూడా।
ఏవం రూపే పరా విద్యా సత్యేన తపసాపి చ బ్రహ్మచర్యాదిభిః భక్తైః లభ్యా వేదాంతవర్త్మనా।	తెలియబడేదానికి ఆవల "తెలుసుకొనువాడు" (The knower prior to all knowings) - వేంచేసి ఉన్నాడు. ఆతడు అసత్యమును అధిగమించి సత్యమును ఆశ్రయించటంచేతను, బ్రహ్మమునే ఉపాసిస్తూ బ్రహ్మచర్యము నిర్వర్తించుట చేతను, భక్తి చేతను - **అట్టి పరావిద్యను పొందుచున్నాడు.**
స్వశరీరే స్వయం జ్యోతిః స్వరూపం పారమార్థికమ్ క్షీణదోషాః ప్రపశ్యంతి। నేతరే మాయయావృతాః॥	అట్టివాడు స్వయంజ్యోతి స్వరూపమగు పారమార్థికస్వరూపమును స్వశరీరంలోనే సందర్శిస్తున్నాడు. దృష్టికి సంబంధించిన సమస్త దోషములు తొలగగా అట్టి వేదాంతజ్ఞాని తనయందే పరమాత్మను గమనిస్తున్నాడు. మాయాదృష్టితో ఆవృతమైన బుద్ధిగల తదితరులు పరమాత్మను ఎక్కడా కూడా బాహ్య-అభ్యంతరములలో దర్శించలేకపోతున్నారు.
ఏవం స్వరూప విజ్ఞానం యస్య కస్యాస్తి యోగినః కుత్ర చిత్ గమనం నాస్తి తస్య సంపూర్ణ రూపిణః॥	ఏ యోగి (లేక) యోగ సిద్ధుడైతే (అంతర హృదయములో సర్వాత్మకుని ఆత్మయందు దర్శనము అనబడే)- స్వరూప విజ్ఞానము కలిగి ఉంటాడో.... **- సంపూర్ణ రూపి (పూర్ణస్వరూపుడు)** అగు ఆతనికి (ఒక లోకము నుండి మరొక లోకమునకు రాకపోకలు అనబడే) **గమనాగమనములు ఉండవు.**
ఆకాశమ్ ఏకం సంపూర్ణం కుత్రచిత్ నహి గచ్ఛతి, తద్వత్ బ్రహ్మాత్మవిత్ శ్రేష్ఠః కుత్రచిత్ నైవ గచ్ఛతి। అభక్షస్య నివృత్త్యా తు విశుద్ధం హృదయం భవేత్।	సంపూర్ణము, సర్వగతము అగు ఆకాశము ఏవిధంగా ఎక్కడికో వెళ్లటము, ఎక్కడినుండో రావటము - అనునవే ఉండవో, అదేవిధంగా బ్రహ్మమును గురించి ఎరిగి, బ్రహ్మము తానై యున్న బ్రహ్మాత్మవిత్‌శ్రేష్ఠునికి-ఎక్కడి నుండి ఎక్కడికీ **రాక - పోకలు ఉండవు. అట్టివారు అభక్ష్యము (పొందకూడనివి, అనుభవించకూడనివి) పొంద కుండానే ఉన్నవారై,** సమస్త అభక్ష్యములనుండి **విముక్తులై,** విశుద్ధమగు హృదయమునందు **అఖండమగు ఆత్మను దర్శిస్తూ, స్వహృదయమునందే ఆత్మస్వరూపులై ఉంటున్నారు.**

ఆహార శుద్ధౌ చిత్తస్య
విశుద్ధిః భవతి స్వతః।
చిత్తశుద్ధౌ క్రమాత్ జ్ఞానం।
త్రుట్యంతే గ్రన్థయః స్ఫుటమ్।

[ఇంద్రియములతో - శాస్త్రానుగతంగా స్వీకరించవలసినవి స్వీకరిస్తూ, త్యజించవలసిన (కామ క్రోధాదులను) త్యజిస్తూ], ఆహారము (ఇంద్రియ విషయములు) - సంబంధించిన శుద్ధి పొందుచున్నారు. తద్వారా (ఇష్టాయిష్ట రూపములతో కూడిన) చిత్తముయొక్క శుద్ధి స్వతఃగానే అతనియందు కలుగుతుంది.

చిత్తశుద్ధిచే 'జ్ఞానము' క్రమంగా వికసించ గలదు. అట్టి జ్ఞానముచే హృదయగ్రంథులు విడిపోతాయి.

అభక్ష్యం బ్రహ్మవిజ్ఞాన
విహీనస్యైవ దేహినః
స సమ్యక్ జ్ఞానినః తద్వత్
స్వరూపగ్ం సకలం ఖలు।

ఇంకా కూడా,

సమ్యక్‌జ్ఞానికి ఈ జగత్తంతా తన యొక్క స్వాభావిక చమత్కార స్వరూపమే అవుతుంది. అందుచేత బ్రహ్మజ్ఞానికి ఇక్కడ 'అభక్ష్యము' అంటూ ఏదీ ఉండదు.

బ్రహ్మజ్ఞాన - విహీనునికో? ఆతనిచే స్వీకరించబడేదంతా అభక్ష్యమేగా పరిణమించగలదు.

---

10. "అహమ్ అన్నగ్ం।
సదా అన్నాదః।"
ఇతి హి బ్రహ్మవేదనమ్।
బ్రహ్మవిత్ గ్రసతి జ్ఞానాత్
సర్వం బ్రహ్మాత్మనైవ తు।

బ్రహ్మజ్ఞానము కలవాడు

- నేనే అన్నమును (I am all that being experienced)
- నేనే అన్నాదును కూడా (I am the maker / worker for all that being experienced) - **అని ఎరిగి ఉంటున్నాడు.**

బ్రహ్మము ఎరిగిన బ్రహ్మవేత్త 'సమస్తము బ్రహ్మమే' అను బ్రహ్మాత్మ జ్ఞానమును ఏమాత్రము ఏ సందర్భములోను విడువడు.

బ్రహ్మ క్షత్రాదికం సర్వం
యస్యస్య ఆదోదనం సదా
(యస్యస్యాదోదనం సదా),
యస్య ఉపసేచనం మృత్యుః
తన్ జ్ఞానీ తాదృశః ఖలు।
బ్రహ్మస్వరూప విజ్ఞానాత్
జగత్ భోజ్యం భవేత్ కిల।

ఏ ఆత్మకు (పరబ్రహ్మమునకు) బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనబడేదంతా ఆదోదనము (ఆహారము) అగుచున్నదో, ఎవనికి మృత్యువు కూడా ఉపశేచనము (ఉపాహారము / Tiffin) వంటిది అవుతోందో... అట్టి - పరమాత్మ పురుష స్వరూపమే తానని గ్రహించిన వాడు **"ఆత్మజ్ఞాని".**

'బ్రహ్మము ' గురించిన స్వరూపవిజ్ఞానము సిద్ధించుకున్నవానికి - ఈ జగత్తంతా కూడా తాను భోగించు వస్తువుగా అగుచున్నది.

జగత్ ఆత్మతయా భాతి
యదా భోజ్యం భవేత్ తదా (కిల)?
బ్రహ్మ స్వాత్మతయా నిత్యం
భక్షితం సకలం తదా।
యత్ ఆభాసేన రూపేణ
జగత్ భోజ్యం భవేత్తు తత్।
మానతః స్వాత్మనా భాతం
భక్షితం భవతి ధ్రువమ్।

❊ జగత్తంతా ఆత్మయే అయి ఉన్నప్పుడు ఈ జగత్తు ఆత్మకు భోజ్యవస్తువు.

❊ అయితే, ఏదీ కాని ఈ జగత్తు ఆత్మకు భోజ్య వస్తువు (something that is enjoyable) ఎట్లా అవుతుంది?

ఎట్లా అంటే బ్రహ్మమే - **స్వాత్మమయము** అయి, ఈ **సమస్తమును ఆస్వాదిస్తూ** ఉన్నది కాబట్టి.

ఎప్పుడైతే 'ఆభాస' (లేనిది ఉన్నట్లుగా తోచటం) రూపంగా ఈ జగత్తు సత్యమగు ఆత్మకు భోజ్యవస్తువు అవుతోందో, అప్పుడు ఇక ఇదంతా "స్వాత్మ"కు భక్షిత (భుజింపబడే) వస్తువు అవటం ధృవమే (నిజమే) అవుతుంది.

స్వస్వరూపం స్వయం భుక్తే నాస్తి భోజ్యం పృథక్ స్వతః। అస్తిచేత్ అస్తితా రూపం బ్రహ్మైవ అస్తిత్వ లక్షణమ్।	**వాస్తవానికి ఆత్మ తనయొక్క స్వస్వరూపమునే జగత్తుగా అనుభవిస్తోంది.** అంతేగాని జగత్తు తనకు బాహ్యమైన భోజ్య వస్తువుగా కాదు. ఒకవేళ "ఈ జగత్తు ఉన్నది" అని అనుకుంటే **"బ్రహ్మమే ఈ జగత్తును తనయొక్క అస్తిత్వ లక్షణముగా కలిగి ఉంటోంది"** అనవలసిందే।
అస్తితా లక్షణా సత్తా। సత్తా బ్రహ్మ న చ అపరా। నాస్తి సత్తా అతిరేకేణ నాస్తి మాయా చ వస్తుతః।	"అస్తి (ఉన్నది)" - అనునదే సత్త। "సత్త" అనునది బ్రహ్మమే - అయి ఉన్నది. **బ్రహ్మమునకు వేరైన సత్తా దేనికీ లేదు.** "సత్త"కు వేరే ఏదీ లేదు. వస్తుతః "మాయ" అనునదేదీ లేదు. (అందుకే యా మా = ఏది లేదో అని మాయ నిర్వచించబడుతోంది)
యోగినామ్ ఆత్మనిష్ఠానాం మాయా స్వాత్మని కల్పితా।	యోగికి 'ఆత్మనిష్ఠ' యొక్క దృష్టిచే **'మాయ' అనబడేది స్వకీయమగు ఆత్మయొక్క స్వయం కల్పితము మాత్రమే।**
సాక్షి రూపతయా భాతి బ్రహ్మజ్ఞానేన బాధితా।	బ్రహ్మజ్ఞానముచే 'మాయ' అనబడేది బాధించబడినదై, కేవలమగు (నిర్విషయ) సాక్షిత్వమే సర్వత్రా స్వానుభవమవుతోంది. - మాయకు ఆత్మయే సాక్షి. - సాక్షి అగు ఆత్మయే ఉన్నది. 'మాయ' ఆత్మకు స్వయంకల్పితం మాత్రమే। - 'మాయ' అనబడేది ఆత్మకు వేరుగా లేదు.
బ్రహ్మవిజ్ఞాన సంపన్నః ప్రతీతమ్ అఖిలం జగత్। పశ్యన్ అపి సదా నైవ పశ్యతి స్వాత్మనః పృథక్॥	బ్రహ్మజ్ఞాన సంపన్నుడు → ఈ ప్రతీతము (ప్రదర్శనము) అగుచున్న సమస్త జగత్తును - **జగత్తుగా చూస్తూనే, స్వస్వరూపాత్మగా ఆస్వాదిస్తూ ఉంటున్నాడు.** **అనేకంగా** కనిపిస్తున్న ఈ జగత్తు బ్రహ్మజ్ఞానికి **"ఏకమగు ఆత్మ"** గా అనుక్షణికము - **స్వాభావికము అయి అనిపిస్తూ** ఉన్నది.

❖ ❖ ❖

ఈ విధంగా స్వయంభువు బ్రహ్మ - తన మానస పుత్రులకు కామేశ్వర, వైశ్రవణ, బ్రహ్మపుత్ర, వాలఖిల్యులకు ఆత్మజ్ఞానము బోధించారు.

❖ ❖ ❖

పాశుపతబ్రహ్మోపనిషత్ సమాప్తా

ఓం శాంతిః। శాంతిః। శాంతిః ॥

ఇతి అథర్వణ వేదాంతర్గత "పాశుపత బ్రహ్మోపనిషత్"

ఓం శాంతిః। శాంతిః। శాంతిః ॥